క్లుప్తంగా

16లోపు అడ్మిషన్ ఫీజు చెల్లించాలి

రాజంపేట టౌన్ : డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ ఓపెన్ యూనివర్శిటీ ద్వారా డిగ్రీ అభ్యసించాలనుకునే విద్యార్థులు ఈనెల 16వ తేదీలోపు అడ్మిషన్ ఫీజును ఆన్‌లైన్‌లో చెల్లించాలని ఆ యూనివర్శిటీ స్థానిక కో–ఆర్డినేటర్ ఐఎల్ఎన్ చంద్రశేఖర్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. డిగ్రీలో ప్రవేశానికి ఇంటర్, పాలిటెక్నిక్, రెండేళ్ల ఐటీఐ తత్సమానమైన కోర్సుల్లో ఉత్తీర్ణులైన వారు అర్హులన్నారు. వివిధ కారణాల రీత్యా రెగ్యులర్‌గా డిగ్రీ చదవలేని విద్యార్థులు, ప్రభుత్వ, ప్రైవేట్ సంస్థల్లో పనిచేసే ఉద్యోగులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. అలాగే ద్వితీయ, తృతీయ సంవత్సరానికి సంబంధించిన అడ్మిషన్ ఫీజు చెల్లింపునకు గడువును ఈనెల 16 వరకు పొడిగించినట్లు ఆయన తెలిపారు.

వైఎస్సార్‌సీపీలో చేరిక


అల్లాబకాష్ కుటుంబాన్ని వైఎస్ఆర్‌సీపీలోకి ఆహ్వానిస్తున్న నాయకులు

సిద్దవటం : మండల కేంద్రమైన సిద్దవటం దిగువపేటకు చెందిన అల్లాబకాష్ కుటుంబం మంగళవారం వైఎస్ఆర్‌సీపీలో చేరడంతో ఆయనకు వైఎస్ఆర్‌సీపీ మండల ఇన్‌చార్జి మేడా మధుసూదన్‌రెడ్డి పార్టీ కండువావేసి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా అల్లాబకాష్ మాట్లాడుతూ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అమలు చేస్తున్న సంక్షేమ పథకాలకు ఆకర్శితుడనై, మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ జవహర్‌బాషా ఆధర్యంలో వైఎస్ఆర్‌సీపీలో చేరుతున్నాట్లు పేర్కొన్నారు. వైఎస్ఆర్‌సీపీ మండల కన్వీనర్ నీలకంఠారెడ్డి, జిల్లా యూత్ ఉపాధ్యక్షుడు శోభన్‌రెడ్డి, పార్టీ నాయకుడు రావుల సుబ్బారెడ్డి, వినోద్‌కుమార్, వెంకటయ్య, వెంకటరమణ పాల్గొన్నారు.

5 టన్నుల పాస్ఫేట్ మంజూరు

రామాపురం : మండలానికి 5 టన్నుల 14–35–14 పాస్ఫేట్ మంజూరైనట్లు వ్యవసాయ అధికారి నాగమణి మంగళవారం తెలిపారు. అవసరమైన రైతులు వీటిని కొనుగోలు చేయవచ్చునని, 50 కేజీల బస్తా రూ.1,496గా నిర్ణయించినట్లు ఆమె తెలిపారు.

అన్నదానం

రామాపురం : ప్రేమాలయంలో అన్నదానం నిర్వహించారు. మంగళవారం లయన్స్‌క్లబ్ ఆఫ్ రాయచోటి టౌన్ ఆధ్వర్యంలో పీలేరు మండలం సూరకాలపేటకు చెందిన మహమ్మద్ రఫీ ఆర్థిక సహకారంతో ఈ కార్యక్రమాన్ని చేపట్టినట్లు క్లబ్ వ్యవస్థాపక అధ్యక్షుడు లయన్ పీఎస్ హరినాథరెడ్డి తెలిపారు. కార్యక్రమంలో కోశాధికారి హరీష్, మాజీ అధ్యక్షుడు షేక్ మహమ్మద్, వినోద్ కుమార్‌నాయక్, నజీర్‌బాషా, హేమంత్, సుబ్బయ్య, దేవనాథరెడ్డి పాల్గొన్నారు.

ఆలయ నిర్మాణానికి విరాళం


విరాళం అందజేస్తున్న దిన్నెపాడు రవిరాజు

లక్కిరెడ్డిపల్లె : మండలంలోని దిన్నెపాడు గ్రామం వడ్డిపల్లెలో నిర్మిస్తున్న కోదండరామ స్వామి ఆలయానికి జిల్లా వ్యవసాయ శాఖ సహాయ మండలి సభ్యులు రవిరాజులు రూ. 30 వేలు ద్వారబంధం నిమిత్తం విరాళాన్ని అందించారు.

తహసీల్దార్ కార్యాలయం తనిఖీ

పుల్లంపేట : మండల తహసీల్దార్ కార్యాలయాన్ని మంగళవారం రాజంపేట ఆర్డీఓ రామకృష్ణారెడ్డి తనిఖీ చేశారు. కార్యాలయంలోని పలు రికార్డులు పరిశీలించి వీఆర్‌ఓలను మండల రెవెన్యూ సమస్యలు గురించి అడిగి తెలుసుకున్నారు. ప్రజలకు అందుబాటులో ఉంటూ రెవెన్యూ సమస్యలు ఎప్పటికప్పుడు పరిష్కరించాలని ఆయన వీఆర్‌ఓలకు సూచించారు. కార్యక్రమంలో తహసీల్దార్ నరసింహకుమార్, ఆర్ఐ నవీన్ కుమార్ పాల్గొన్నారు.

సీహెచ్‌ఓలకు పదోన్నతులు కల్పించండి

రాజంపేట : రాష్ట్రంలోని కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్ల పదోన్నతులు కల్పించే విషయమై రాష్ట్ర పబ్లిక్ హెల్త్ అండ్ ఫ్యామిలీ వెల్ఫేర్ డైరక్టరు డా.రామిరెడ్డిని కోరినట్లు ఎంపీహెచ్‌ఓ, సీహెచ్‌ఓల సంఘం రాష్ట్ర గౌరవ అధ్యక్షుడు పిల్లి పిచ్చయ్య తెలిపారు. మంగళవారం ఆయన్ను విజయవాడలో కలిసి పదోన్నతులపై వినతిపత్రం అందచేశానన్నారు. దీంతో ఆయన సానుకూలంగా స్పందించి అధికారులతో సమావేశమై ఈ నిర్ణయాన్ని ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తానని హామీ ఇచ్చారన్నారు.

రెండు ఇసుక ట్రాక్టర్లు సీజ్

మదనపల్లె: అక్రమంగా ఇసుక తరలిస్తున్న రెండు ట్రాక్టర్లను సీజ్ చేసినట్లు తాలూకా సీఐ సత్యనారాయణ తెలిపారు. మంగళవారం మండల పరిధిలోని బెంగుళూరు రోడ్డులో ఇసుక రవాణాకు సంబంధించి ఎటువంటి అనుమతులు, పర్మిట్ లేకుండా ట్రాక్టర్లలో ఇసుక రవాణా చేస్తున్నట్లు సమాచారం అందడంతో తాలూకా పోలీసులు దాడులు చేశారు. కేసు నమోదు చేస్తామని చెప్పారు.

దివ్యాంగుల సంక్షేమం కోసం ప్రభుత్వం కృషి

- దివ్యాంగుల్లో ఆత్మవిశ్వాసం పెంపొందించడమే లక్ష్యం
- జిల్లా కలెక్టర్ గిరీషా పీఎస్, ఎమ్మెల్యే గడికోట శ్రీకాంత్ రెడ్డి


పార్కులో ప్రజలతో మాట్లాడుతున్న శ్రీకాంత్‌రెడ్డి


రాయచోటి: దివ్యాంగులకు ట్రై సైకిళ్లను అందిస్తున్న కలెక్టర్ గిరీషా పీఎస్, ఎమ్మెల్యే శ్రీకాంత్ రెడ్డిలు

రాయచోటి : దివ్యాంగుల సంక్షేమానికి ప్రభుత్వం నిరంతరం కృషి చేస్తుందని జిల్లా కలెక్టర్ గిరీషా పీఎస్ పేర్కొన్నారు. మంగళవారం అన్నమయ్య జిల్లా కేంద్రం రాయచోటి కలెక్టరేట్‌లో జిల్లా విభిన్న ప్రతిభావంతులు, వయోవృద్ధుల సహాయ సంస్థ, అన్నమయ్య రెడ్‌క్రాస్ సొసైటీ ఆధ్వర్యంలో రాయచోటి నియోజకవర్గం దివ్యాంగుల ఆసరా కార్యక్రమంలో వారికి ట్రై సైకిల్స్, త్రి వీలర్ మోటార్ వెహికల్స్, వినికిడి యంత్రాలు, వీల్ చైర్స్‌ను జిల్లా కలెక్టర్ గిరీషా పీఎస్, శాసనసభ వ్యవహారాల సమన్వయకర్త, రాయచోటి ఎమ్మెల్యే గడికోట శ్రీకాంత్ రెడ్డి, మున్సిపల్ చైర్మన్ ఫయాజ్ బాషా, డీఆర్‌ఓ సత్యనారాయణల చేతులమీదుగా లబ్ధిదారులకు పంపిణీ చేశారు. రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి ఆదేశాల మేరకు అర్హత ఉన్న వారందరికీ ప్రభుత్వ పథకాలు అందేలా చర్యలు తీసుకుంటున్నామని కలెక్టర్ గిరీషా పీఎస్ అన్నారు. ప్రతి ఒక్కరికీ సమాన హక్కులు అందించడమే లక్ష్యంగా ప్రభుత్వం పాలన సాగిస్తున్నట్టు పేర్కొన్నారు. దివ్యాంగులకు వీలైన వాహనాలను ప్రభుత్వం పూర్తిగా ఉచితంగా అందజేసినట్లు తెలిపారు. దాదాపు 100 మంది దివ్యాంగులకు ట్రై సైకిల్స్, త్రి వీలర్ మోటార్ వెహికల్స్, వినికిడి యంత్రాలు, వీల్ చైర్స్ వివిధ రకాల పరికరాలను అందజేశామన్నారు. త్రివీలర్ మోటార్ వెహికల్స్ సుమారు రూ. 45 వేలు విలువచేసే యంత్రాలు పంపిణీ చేశామన్నారు. రాయచోటి, రాజంపేట, రైల్వేకోడూరు నియోజకవర్గాలలో దివ్యాంగులకు జిల్లా కేంద్రంలో పెద్దఎత్తున క్యాంపు నిర్వహించి ఎంతమంది అర్హత ఉంటే అందరికీ పరికరాలు అందజేస్తామన్నారు. దివ్యాంగుల కోసం కృత్రిమ పరికరాలు తయారు చేయడానికి కొలతలు తీసుకోవడానికి క్యాంపులు కూడా దివ్యాంగుల సంక్షేమశాఖ నిర్వహిస్తుందన్నారు.

వారిలో ఆత్మవిశ్వాసం పెంపొందించడమే లక్ష్యం – ఎమ్మెల్యే శ్రీకాంత్‌రెడ్డి

దివ్యాంగులలో ఆత్మవిశ్వాసం పెంపొందించడమే ప్రభుత్వ లక్ష్యమని ఎమ్మెల్యే గడికోట శ్రీకాంత్‌రెడ్డి అన్నారు. రాజంపేట ఎంపీ పెద్దిరెడ్డి మిథున్ రెడ్డి ఒక సంస్థతో మాట్లాడి ఎంతమంది అర్హత ఉంటే అంత మంది దివ్యాంగులకు పరికరాలు అందజేయాలని ప్రోత్సహించడంతో, అందుకు కలెక్టర్ మ్యాచింగ్ చేయడంతో ఈరోజు 100 మందికి వివిధ రకాల పరికరాలను పంపిణీ చేశామన్నారు. తమకు పరికరాలు అందజేసినందుకు రాష్ట్ర ముఖ్యమంత్రి, ఎంపీ, కలెక్టర్‌కు దివ్యాంగులు కృతజ్ఞతలు తెలియజేశారు. రాబోవు నెలరోజుల్లో రాయచోటి, రాజంపేట, రైల్వే కోడూరు నియోజకవర్గాల్లో పెద్దక్యాంపు పెట్టి 2 వేల మందికి అర్హత ఉన్న ప్రతి ఒక్కరికీ వివిధ రకాల పరికరాలు పంపిణీ చేస్తామన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ ఫయాజ్ బాషా, డీఆర్‌ఓ సత్యనారాయణ, అన్నమయ్య జిల్లా రెడ్ క్రాస్ సొసైటీ కార్యదర్శి రాజశేఖర్ రెడ్డి, దివ్యాంగులు, వయోవృద్ధుల సంక్షేమశాఖ ఏడీ కిషోర్, వివిధ శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు.

పార్కు నిర్మాణాన్ని వేగవంతం చేయండి

రాయచోటి అర్బన్ : డైట్ హాస్టల్ ప్రాంగణంలో నిర్మితమవుతున్న మున్సిపల్ చిన్నపిల్లల పార్కులో మహిళలకు పూర్తిస్థాయిలో రక్షణ ఉండేలా చర్యలు తీసుకోవాలని ఎమ్మెల్యే గడికోట శ్రీకాంత్‌రెడ్డి అధికారులను ఆదేశించారు. మంగళవారం మున్సిపల్ చైర్మన్ చిల్లీస్ ఫయాజ్‌బాషా, కమిషనర్ గంగాప్రసాద్‌తో కలసి ఆయన పార్కు నిర్మాణ పనులను పరిశీలించారు. పనులను వేగవంతం చేయాలంటూ తెలియజేశారు. వారం రోజులో మొక్కలు నాటే కార్యక్రమం, 15రోజులలోపు ఓపెన్ జిమ్ ఏర్పాటు చేయాలంటూ సూచించారు. పార్కులో ఆకతాయిలతో ఇబ్బంది లేకుండా సీసీ కెమెరాలు ఏర్పాటు చేయాలని అర్బన్ సీఐ సుధాకర్‌రెడ్డికి ఎమ్మెల్యే సూచించారు. పార్కులో వాకింగ్ చేస్తున్న వారితో శ్రీకాంత్‌రెడ్డి ఈ సందర్భంగా మమేకమయ్యారు. అధునాతన వసతులు, సౌకర్యాలతో పార్కు ఏర్పాటవుతుండడం హర్షణీయమంటూ వారు శ్రీకాంత్‌రెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు.

భావిభారత పౌరులను తయారు చేసే శాస్త్రవేత్తలు మీరే

రాయచోటి టౌన్ : భావిభారత పౌరులును తయారు చేసే శాస్త్రవేత్తలు మీరేనని ఉపాధ్యాయులను రాయచోటి ఎమ్మెల్యే శ్రీకాంత్‌రెడ్డి అన్నారు. మంగళవారం డైట్ కేంద్రంలో టీచర్ ట్రైనింగ్ పూర్తి చేసుకున్న విద్యార్థుల వీడ్కోల సమావేశానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఆయన మాట్లాడుతూ ఉపాధ్యాయులుగా శిక్షణ తీసుకున్న మీరు ఉత్తమ ఉపాధ్యాయులుగా మారి విద్యార్థుల విద్యాభివృద్ధికి కృషి చేయాలని కోరారు. రాబోవు రోజుల్లో డీఎస్సీలో రాణించి ఉద్యోగాలు సాధించాలని ఆకాంక్షించారు. మున్సిపల్ చైర్మన్ ఫయాజ్ బాషా, డీఈఓ శ్రీరాం పురుషోత్తం, పీఆర్‌టీయూ రాష్ట్ర క్రమశిక్షణ సంఘం అధ్యక్షుడు శ్రీనివాస రాజులు విద్యార్థులకు సూచనలు చేశారు. అనంతరం శ్రీకాంత్‌రెడ్డిని వారు ఘనంగా సన్మానించారు. మున్సిపల్ కమిషనర్ గంగా ప్రసాద్, ఎంఈఓ బాలాజీ నాయక్, వెంకట శివారెడ్డి, రాష్ట్ర సివిల్ సప్లయిస్ డైరెక్టర్ పోలు సుబ్బారెడ్డి, వైఎస్సార్ సీపీ మనదపల్లె పరిశీలకులు హబీబుల్లాఖాన్, గౌస్‌ఖాన్, షబ్బీర్, రియాజ్, డైట్ అధ్యాపకులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

5న మండల మీట్

నందలూరు(రాజంపేట) : ఈనెల 5న నందలూరు మండల పరిషత్ సర్వసభ్య సమావేశం నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ సౌభాగ్య మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఎంపీపీ మేడా విజయభాస్కర్‌రెడ్డి అధ్యక్షతన ఉదయం 10గంటలకు జరిగే సర్వసభ్య సమావేశానికి అన్ని ప్రభుత్వశాఖల అధికారులు, ఎంపీటీసీలు, సర్పంచులు హాజరుకావాలన్నారు.

మున్సిపల్ కార్మికుల ధర్నా



రాజంపేట : రాజంపేటలో మంగళవారం స్థానిక మున్సిపాలిటీ కార్యాలయం వద్ద కార్మికులు ధర్నా నిర్వహించారు. మున్సిపల్ వర్కర్స్ అండ్ హెల్పర్ యూనియన్ ఆధ్వర్యంలో ధర్నా చేపట్టారు. రాష్ట్ర ప్రభుత్వం న్యాయమైన కోర్కెలను పరిష్కరించాలని డిమాండ్ చేశారు. సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు చిట్వేలి రవికుమార్ ఆధ్వర్యంలో పెద్దసంఖ్యలో కార్మికులు పాల్గొన్నారు. సీహెచ్ ఓబయ్య, కె.ప్రసాద్, డి.లక్ష్మీదేవి, వెంకటరమణ, నరసింహ సర్వేపల్లి పాల్గొన్నారు.

పట్టు రైతులకు శిక్షణ

బి.కొత్తకోట: మండలంలోని గోళ్లపల్లె రైతు భరోసా కేంద్రంలో మంగళవారం పట్టు రైతులకు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. పట్టు అధికారి రసూల్ మాట్లాడుతూ ప్రభుత్వం రైతులకు కల్పిస్తున్న రాయితీ పథకాలు, మల్బరీతోటల్లో షెడ్ల నిర్మాణం, ఇతరా కార్యక్రమాల గురించి వివరించారు. కార్యక్రమంలో సర్పంచులు పుష్పలత, ఉజ్జయిని సాంబశివ, ఎంపీటీసీ విమలమ్మ పాల్గొన్నారు.

బీసీలకు వెన్నుదన్నుగా నిలిచింది వైఎస్సార్‌సీపీనే


భాస్కర్‌యాదవ్
బీసీ సంఘం నేత

రాజంపేట : బీసీలకు వెన్నుదన్నుగా వైఎస్సార్‌సీపీ నిలిచిందని నియోజకవర్గ బీసీ సంఘం అధ్యక్షుడు భాస్కర్‌యాదవ్ వెల్లడించారు. మంగళవారం తన కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ నారా లోకేష్ పాదయాత్రలో భాగంగా అద్దంకిలో నిర్వహించిన బీసీల సమావేశంలో బీసీలకు సీఎం వైఎస్ జగన్ ఏం చేయలేదని చేసిన వ్యాఖ్యలను ఖండించారు. బీసీలకు ప్రాధాన్యత ఇస్తూ రాజకీయంగా వారిని చైతన్యపరుస్తున్న పార్టీ వైఎస్సార్‌సీపీనే అని తెలియజేశారు. బీసీలకు అత్యధికంగా ఎమ్మెల్యే, ఎమ్మెల్సీ, జెడ్పీ చైర్మన్, నామినేటెడ్ పదవులు ఇచ్చింది వైఎస్సార్‌సీపీనేనన్నారు. చంద్రబాబునాయుడు బీసీలను కేవలం ఓటు బ్యాంకుగా వాడుకుంటూ అధికారంలోకి వచ్చిన తర్వాత చేతికి సుత్తి, కత్తెర ఇచ్చి ఏదో చేసేశామని కల్లబొల్లి మాటలు చెప్పే అలవాటు ఆయనదేని పేర్కొన్నారు. బీసీలు ఎదురుతిరిగితే నాలుగులు కత్తిరిస్తాం, ఏంటీ తమాషా చేస్తున్నారంటూ గతంలో చంద్రబాబు బీసీలను బెదరగొట్టిన సంగతి అందరికి తెలిసిందేనన్నారు. బీసీల మీద పెత్తనం చెలాయించే తత్త్వం చంద్రబాబునాయుడిదన్నారు. బీసీలను బ్యాక్‌వర్డ్ క్లాస్‌గా కాకుండా బ్యాక్‌బోన్ క్లాస్‌గా తీర్చిదిద్దుతున్న నాయకుడు ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికే దక్కుతుందన్నారు.

కంచెను ధ్వంసం చేశారంటూ ఫిర్యాదు


ఆక్రమణదారులు ధ్వంసం చేసిన కంచె

ఒంటిమిట్ట : తమ పొలంలో వేసిన కంచెను ధ్వంసం చేసి పొలాన్ని ఆక్రమించుకునేందుకు కొందరు ప్రయత్నించినట్టు బాధితులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. వివరాలు... మండలంలోని మంటపంపల్లె రెవెన్యూ సర్వే నెంబర్ 513–4లో పెద్దకొట్ల వెంకట సుబ్బయ్యకు 3.05 ఎకరాల భూమిని ప్రభుత్వం గతంలో ఇచ్చింది. సదరు భూమిని వెంకట సుబ్బయ్య అతని కుమారులు వేణుగోపాల్, అనంత శంకరయ్యలు సాగు చేసుకుంటున్నారు. మూడు నెలల నుంచి వివిధ కారణాల వల్ల వారు కడపలో ఉంటున్నారు. ఇదే అదునుగా భావించిన వినోద్ కుమార్, నాగరాజు అనే సోదరులు వారి పొలంతోపాటు వెంకట సుబ్బయ్యకు చెందిన భూమిని ఆక్రమించి దున్నారు. విషయం తెలుసుకున్న వెంకటసుబ్బయ్య కుమారులు తమ భూమిని తమకు దక్కేలా చేయాలంటూ ఎస్పీ, తహసీల్దార్‌కు ఫిర్యాదు చేయడంతో వారు సర్వే చేసి వారికి చెందిన భూమి గుర్తించి వారికి తెలియజేశారు. తమ భూమి వరకు వెంకటసుబ్బయ్య కుమారులు సోమవారం కంచెను ఏర్పాటు చేసుకున్నారు. ఇది గమనించిన ఆక్రమణదారులు, మరి కొందరితో కలిసి పొలం యజమానుల నాటిన కంచెను రాత్రికి రాత్రి ధ్వంసం చేశారు. దీనిపై స్థల యజమానులు ఆక్రమణదారులను ప్రశ్నించగా వారు ఇది మా పొలం, దీని జోలికి వస్తే చంపేస్తామంటూ బెదిరిస్తున్నారంటున్నారు స్థానిక పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు.

లంపీ టీకాలను సద్వినియోగం చేసుకోవాలి


రాజంపేట రూరల్: పశువులకు టీకా వేస్తున్న దృశ్యం

రాజంపేట రూరల్ : రాష్ట్ర ప్రభుత్వం ఉచితంగా అందజేసే లంపీ చర్మ వ్యాధి టీకాలను పాడి రైతులు సద్వినియోగం చేసుకోవాలని పశుసంవర్ధకశాఖ ఉప సంచాలకులు కె.ప్రతాప్ కోరారు. పట్టణంలో ఆయన ఆధ్వర్యంలో మంగళవారం ఉచిత లంపీ చర్మ వ్యాధి టీకాలను పశువులకు అందజేశారు. ఈ సందర్భంగా అధికారి మాట్లాడుతూ తెల్లజాతి పశువులలో చర్మం పైన దద్దుర్లు వచ్చి నీరు తీసుకోలేక నీరసించి ప్రాణాలు పోగొట్టుకుంటాయని తెలియజేశారు. ఈ వ్యాధిని నిర్మూలించేందుకు రాష్ట్ర ప్రభుత్వం ఉచితంగా మందులు పంపిణీ చేస్తుందన్నారు. నేటి నుంచి 15వ తేదీ వరకు టీకాలు వేయనున్నట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో జేవీఓ ఎం వరదయ్య, పశువైద్య సహాయకులు దత్తాత్రేయ, హరిబాబు తదితరులు పాల్గొన్నారు.

పశువైద్య శిబిరం

పెనగలూరు : మండలంలోని కొండూరు రైతు భరోసా కేంద్రంలో డాక్టర్ వైఎస్సార్ సంచార ఆరోగ్యసేవ – 1962 వాహనంతో పశువులకు వైద్య సేవలు అందించినట్లు కాకర్లవారిపల్లె పశువైద్య డాక్టర్ వేదవతి తెలిపారు. కొండూరులో పశువులకు వైద్య సేవలు అందించాలని వైస్ ఎంపీపీ కొండూరు విజయ్ రెడ్డి పశువైద్య శిబిరం ఏర్పాటు చేయాలని తెలియజేయడంతో 1962 వాహనం గురించి రైతులకు వివరించి మందులను పంపిణీ చేశామన్నారు. ఈ వైద్య శిబిరం బుధవారం కూడా ఏర్పాటు చేసి ఎల్ఎస్‌డీ వ్యాధి నివారణ టీకాలు వేయించాలని గోపాలమిత్ర పెంచలయ్య, ఏహెచ్ఏ సతీష్‌ను డాక్టర్ ఆదేశించారు.

ఫిర్యాదుపై మోడల్ స్కూల్ తనిఖీ


రికార్డులు పరిశీలిస్తున్న డిప్యూటీ డీఈఓ వరలక్ష్మి

పెనగలూరు : ఏపీ మోడల్ స్కూల్‌ను మంగళవారం డిప్యూటీ డీఈఓ వరలక్ష్మి ఆకస్మికంగా తనిఖీ చేశారు. పలు రికార్డులను ఆమె పరిశీలించారు. మోడల్ స్కూల్‌పై ఫిర్యాదు రావడంతో డిప్యూటీ డైరెక్టర్ ఆదేశాల మేరకు తనిఖీకి వచ్చినట్లు వారు తెలిపారు. హాస్టల్‌ను పరిశీలించి మెనూ ప్రకారం భోజనం వడ్డిస్తున్నారా లేదా అని విద్యార్థులను వద్ద ఆరా తీశారు. తనిఖీలోని సమాచారాన్ని అధికారులకు పంపించనున్నట్లు వారు తెలిపారు. కార్యక్రమంలో జీసీడీఓ రాధ, మోడల్ స్కూల్ సూపరింటెండెంట్ శ్రీనివాసులు, పెనగలూరు ఎంఈఓలు సుబ్బరాయుడు, కోదండనాయుడు, పుల్లంపేట ఎంఈఓ చక్రధర్, సీఆర్‌పీలు సుజాత, శశికళ, నరసింహులు, బాద్‌షా పలువురు అధికారులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

మానవ అక్రమ రవాణా నివారణపై అవగాహన

తంబళ్లపల్లె: స్థానిక గిరిజన బాలుర రెసిడెన్షియల్ పాఠశాలలో మంగళవారం మదనపల్లె హెల్పింగ్ మైండ్స్ ఆధ్వర్యంలో మానవ అక్రమ రవాణా నివారణపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. హెల్పింగ్‌మైండ్స్ వ్యవస్థాపకులు అబూబకర్ సిద్దిక్ మాట్లాడుతూ చిన్నారులను, మహిళలను కొందరు అక్రమ రవాణా చేసి బానిసలుగా మారుస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. అక్రమ రవాణాకు గురైన వారి జీవితాలు బానిసత్వంలో మగ్గుతున్నాయన్నారు. ఎవరైనా అనుమానాస్పదంగా సంచరిస్తున్నా, అపరచితుల గురించి వెంటనే 1098కు సమాచారం అందించాలన్నారు.

నేరాల నియంత్రణ, శాంతి భద్రతల పరిరక్షణకు చర్యలు

– అన్నమయ్య జిల్లాలో నేరాలు 23 శాతం తగ్గుముఖం


జిల్లానేర సమీక్ష సమావేశంలో మాట్లాడుతున్న ఎస్పీ గంగాధర్ రావు

రాయచోటి : నేరాల నియంత్రణ, శాంతి భద్రతల పరిరక్షణకు ప్రత్యేక చర్యలు చేపట్టనున్నట్లు జిల్లా ఎస్పీ ఆర్.గంగాధర్ రావు అన్నారు. అన్నమయ్య జిల్లా రాయచోటి పట్టణంలోని అభి ఫంక్షన్ హాల్‌లో ఎస్పీ అధ్యక్షతన అర్ధసంవత్సర నేర సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి నేషనల్ హైవే ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ విజయభాస్కర్, డిస్ట్రిక్ట్ కో–ఆర్డినేటర్ ఆఫ్ హాస్పిటల్ సర్వీసెస్ డాక్టర్ టి.డేవిడ్ కుమార్, రీజనల్ ఫోరెన్సిక్ సైన్స్ లేబరేటరీ ఓఎస్‌డీ డాక్టర్ సి.కొండారెడ్డి, డీసీహెచ్ఓ డాక్టర్ ఎస్.కొండయ్య, డిస్ట్రిక్ట్ మెడికల్ ఆఫీసర్ పి.రాములు ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ఈ సందర్భంగా జిల్లాలో నేరాల నియంత్రణకు ప్రత్యేక కార్యాచరణతో ప్రణాళికాబద్ధంగా చర్యలు తీసుకుంటున్నామని ఎస్పీ తెలిపారు. అన్నిశాఖల సమన్వయంతో పనిచేసి నేరాల నియంత్రణకు పటిష్టమైన చర్యలు చేపట్టి జిల్లాలో ప్రశాంతమైన వాతావరణాన్ని నెలకొల్పేందుకు కృషి చేయాలని ఆయన కోరారు. ముఖ్యంగా మహిళలు మిస్సింగ్ కేసులను సవాలుగా స్వీకరించి త్వరగా ట్రాక్ చేయాలని సూచించారు. 2023 అర్థ సంవత్సరంలో అన్నమయ్య జిల్లాలో దారి దోపిడీలు, దౌర్జన్యాలు, కిడ్నాప్‌లు, రేప్‌లు, హత్యాయత్నాలు, రోడ్డు ప్రమాదాలు, సాధారణ దొంగతనాలు, ఘర్షణలు గత అర్ధ సంవత్సరంతో పోల్చితే తగ్గాయని ఎస్పీ వివరించారు. రాత్రి, పగటి వేళల్లో ఇంటికి కన్నాలు వేసి దొంగతనాలు, మర్డర్‌లు, దొమ్మీలు, ఛీటింగ్ కేసులు స్వల్పంగా పెరిగాయన్నారు. వీలైనంత వరకు నేరాలు తగ్గించి చర్యలు తీసుకుంటామని ఎస్పీ తెలిపారు. మహిళలపైన జరిగే నేరాలు, ఫోక్సో నేరాలు గణనీయంగా తగ్గాయన్నారు. అయితే వరకట్న హత్యలు స్వల్పంగా పెరిగాయన్నారు. విజిబుల్ పోలిసింగ్ మనకు ప్రధాన ఆయుధమని ఎస్పీ అన్నారు. వీరు బాధ్యతలను దీక్షతో నిర్వర్తించినప్పుడే ఫలితాలను పొందవచ్చన్నారు.

సామాన్యులకు ప్రాధాన్యత

సామాన్య ప్రజల సమస్యలను నిర్లక్ష్యం చేయకూడదని, వారి సమస్యలకు అధిక ప్రాధాన్యత ఇవ్వాలని పోలీసు అధికారులు, సిబ్బందికి ఆదేశించారు. తద్వారా పోలీస్ వ్యవస్థ పట్ల ప్రజలలో నమ్మకం, విశ్వాసం పొందేలా వ్యవహరించాలన్నారు. క్రింది స్థాయి సిబ్బంది నుండి అధికారుల వరకు సమష్టిగా, సమన్వయంతో పనిచేస్తూ ప్రజలకు మెరుగైన సేవలందిద్దామని ఎస్పీ పిలుపునిచ్చారు. విధులలో పోలీస్‌శాఖకు మచ్చతెచ్చే పనులు తీసుకురావద్దని హితవుపలికారు. కేసు దర్యాప్తులో క్రిందిస్థాయి సిబ్బందిని పూర్తిగా వదిలేసి ఎస్‌హెచ్‌ఓలు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే ఉపేక్షించే ప్రసక్తే లేదన్నారు. సమావేశంలో అదనపు ఎస్పీ డాక్టర్ విబి రాజు కమల్, డైరెక్ ఆఫ్ ప్రాసిక్యూటర్, పబ్లిక్ ప్రాసిక్యూటర్లు, జిల్లాలోని పోలీస్ అధికారులు, వివిధ విభాగాల శాఖ ఉన్నతాధికారులు, సిబ్బంది పాల్గొన్నారు. అనంతరం పోలీసులకు, పోలీస్ అధికారులకు ఎస్పీ చేతులు మీదుగా ప్రశంసాపత్రాలు అందజేశారు.

పురిటి బిడ్డలకు తల్లిపాలే శ్రీరామరక్ష

ఒంటిమిట్ట : పురిటి బిడ్డలకు తల్లి పాలు శ్రీరామరక్షలా కాపాడుతాయని అంగన్‌వాడీ ఏపీడీఓ శోభారాణి అన్నారు. మంగళవారం తల్లి పాల వారోత్సవాలలో భాగంగా మండల కేంద్రంలోని నాలుగు అంగన్‌వాడీ కేంద్రాల్లో ఆమె గర్భిణులు, బాలింతలతో మాట్లాడారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ సూపర్‌వైజర్ పద్మజ, అంగన్‌వాడీ కార్యకర్తలు, ఆయాలు పాల్గొన్నారు.

విద్యార్థులకు ప్రోత్సాహకాలు అందజేత


నగదు బహుమతిని అందిస్తున్న దృశ్యం

చిట్వేలి : మండల పరిధిలోని వెంకట్రాజుల్లి, కె.కందులవారిపల్లె జెడ్పీ ఉన్నత పాఠశాలలో పదోతరగతిలో ప్రతిభచూపిన ఆణిముత్యాలకు చిట్వేలి హెల్ప్‌లైన్ సొసైటీ ఆధ్వర్యంలో మంగళవారం నగదు ప్రోత్సాహక బహుమతులను అందజేశారు. ఈ సందర్భంగా సంస్థ ప్రధాన కార్యదర్శి గాడి ఇంతియాజ్ అహ్మద్ మాట్లాడుతూ అజ్ఞాత దాత అందించిన ఆర్థిక సహాయంతో మండలంలోని ఆరు ఉన్నతపాఠశాలల్లో ప్రతిభచూపిన ఆణిముత్యాలకు ప్రథమ, ద్వితీయ, తృతీయ ప్రోత్సాహక బహుమతులను అందజేసి విద్యార్థులలో స్ఫూర్తిని కలిగించామన్నారు. ప్రధానోపాధ్యాయులు భాస్కర్, చెంగయ్య, హిందీ పండిట్ మహేశ్వరి, సంస్థ ఉపాధ్యక్షులు జి.శివారెడ్డి, తిరుమలరెడ్డి, షేక్ ఆరిఫుల్లా, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

అనుమానాస్పద స్థితిలో వ్యక్తి మృతి

కడప అర్బన్: కడప నగరంలోని ఎన్టీఆర్ సర్కిల్ సమీపంలో షేక్ ఖాజావల్లీ (45) అనే వ్యక్తి అనుమానాస్పద స్థితిలో మృతి చెందాడు. కడప వన్ టౌన్ ఎస్ఐ రంగస్వామి తెలిపిన వివరాల మేరకు.. పోరుమామిళ్లకు చెందిన ఖాజావల్లీ ఎన్టీఆర్ సర్కిల్ సమీపంలో ఓ టైలర్ షాపులో పనిచేస్తుండేవాడు. ఖాజావలి తాను పనిచేస్తున్న టైలర్ షాపులోనే ఉండేవాడు. సోమవారం రాత్రి అక్కడే పడుకున్న అతను తెల్లారేసరికి మృతి చెందాడు. టైలర్ షాపు ఓనర్ అన్వర్ హాఖ్ కుటుంబసభ్యులు షాపు తెరిచి చూసి అతడు మృతి చెందిన విషయాన్ని గమనించి పోలీసులకు తెలియజేశారు. మృతికి గల కారణాలు తెలియాల్సివుంది. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ రంగస్వామి తెలియజేశారు.

ప్రమాద బాధితులకు ఆర్థిక సాయం


బస్సు కండక్టర్ బాల వెంకటేష్ కుటుంబానికి ఆర్థిక సాయాన్ని అందజేస్తున్న నాయకులు, అధికారులు


సిద్దవటం : చిన్నఓరంపాడు వద్ద జరిగిన రోడ్డు ప్రమాదంలో తీవ్రగాయాలైన బాధిత కుటుంబాలకు ఒక్కొక్కరికి రూ.2లక్షలు ఆర్థిక సాయాన్ని మంగళవారం వైఎస్ఆర్‌సీపీ సిద్దవటం మండల ఇన్‌చార్జి మేడా మధుసూదన్‌రెడ్డి, తహసీల్దారు లక్ష్మీదేవి, డీటీ రాజేష్ క్రిష్ణలు అందజేశారు. ఈ సందర్భంగా తహసీల్దారు లక్ష్మీదేవి మాట్లాడుతూ చిన్నఓరంపాడు వద్ద జరిగిన రోడ్డు ప్రమాదంలో సిద్దవటం మండలంలోని టక్కోలి గ్రామానికి చెందిన బస్సు కండక్టర్ గంగనపల్లె బాలవెంటేష్, జ్యోతి గ్రామానికి చెందిన పిన్నపురెడ్డి నిఖితలు తీవ్రగాయాలు కావడంతో వారు తిరుపతి స్విమ్స్ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నారన్నారు. ఈ మేరకు వారికి అత్యవసర చికిత్స కోసం జిల్లా కలెక్టర్ విజయరామరాజు అడ్మినిస్ట్రేటివ్ ఫండ్స్ నుంచి ఒక్కొక్కరికి రూ. 2 లక్షలు ఆర్థిక సహాయ మంజూరు కావడంతో వారి కుటుంబ సభ్యులకు అందజేశామని ఆమె తెలిపారు. వైఎస్ఆర్‌సీపీ మండల కన్వీనర్ సింగం నీలకంఠారెడ్డి, సుబ్బారెడ్డి పాల్గొన్నారు.

పాడి రైతుల అభివృద్ధే ప్రభుత్వ ధ్యేయం


ఏడీఏ భవనాన్ని పరిశీలిస్తున్న విష్ణువర్ధన్‌రెడ్డి

సంబేపల్లె : పాడిరైతుల అభివృద్ధిని దృష్టిలో ఉంచుకొని ఎన్నో సంక్షేమ కార్యక్రమాలను సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం నిర్వహిస్తోందని డీసీఎంఎస్ మాజీ చైర్మన్ విష్ణువర్ధన్‌రెడ్డి అన్నారు. మంగళవారం మండల కేంద్రంలో దాదాపు రూ.86 లక్షలతో నూతనంగా నిర్మించిన ఏడీఏ భవనాన్ని ఆయన మండల వ్యవసాయ సలహా మండలి చైర్మన్ వాసుదేవరెడ్డితో కలిసి పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ఎమ్మెల్యే గడికోట శ్రీకాంత్‌రెడ్డి కృషితో మండలానికే తలమానికంగా ఏడీఏ భవనాన్ని నిర్మించడం హర్షదాయకమన్నారు. దీంతో పాడి రైతులకు మరిన్ని సేవలు అందుబాటులోకి వస్తాయన్నారు. కార్యాలయంలో పశువ్యాధులకు సంబంధించి పలు రకాల చికిత్సలతోపాటు రోగ నిర్ధారణ పరీక్షలు కూడా నిర్వహిస్తారన్నారు. త్వరలో ఏడీఏ కార్యాలయ భవనాన్ని ప్రారంభించి పాడి రైతులకు అందుబాటులోకి వస్తాయన్నారు.

యాత్రికులు, ఎడ్యుకేషన్ టూర్‌కు బస్సులు


సర్వీసులను ప్రారంభిస్తున్న డీఎం రమణయ్య

రాజంపేట : యాత్రికులు, ఎడ్యుకేషన్ టూర్‌లకు బస్సులను కేటాయిస్తామని రాజంపేట డిపో మేనేజరు రమణయ్య తెలియజేశారు. మంగళవారం స్థానిక బస్టాండులో మూడు ప్రత్యేక బస్సు సర్వీసులను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జవహర్ నవోదయ విద్యాలయం విద్యార్థుల ఎడ్యుకేషన్ టూర్ కోసం ప్రత్యేక బస్సు సర్వీసులను కల్పించామన్నారు. విజయనగరం 1, కేరళకు 2, కర్ణాటకకు 1 బస్సులు పంపామన్నారు. అలాగే ప్రతి పౌర్ణమికి డిపో నుంచి అరుణాచలానికి బస్సులను నడుపుతున్నామన్నారు. విద్యాసంస్థలు, ఇతర సంస్థలకు టూర్లు వెళ్లాలంటే అందుకు తాము బస్సు సర్వీసులను కేటాయిస్తామన్నారు. వివరాలకు 9959225775 నెంబరును సంప్రదించాలన్నారు.

తిలక్ పోరాటం నేటి తరానికి స్ఫూర్తి

కడప కల్చరల్: స్వాతంత్ర్యం నా జన్మహక్కు అని బ్రిటీషు వారిపై పోరాటం చేసిన బాలగంగాధర్ తిలక్ నేటి తరానికి స్ఫూర్తిగా నిలుస్తున్నారని మిత్ర యోగా కేంద్రం నిర్వాహకులు డాక్టర్ రంగనాథరెడ్డి అన్నారు. తిలక్ వర్ధంతి సందర్భంగా పాత రిమ్స్‌లోని అల్‌షిఫా మానసిక వికలాంగుల పునరావాస కేంద్రంలో సంస్థ వ్యవస్థాపక నిర్వాహకులు షేక్ మహ్మద్ రఫీ ఇతర అతిథులతో కలిసి తిలక్ చిత్రపటానికి పూలమాల అలంకరించి నివాళులర్పించారు. లయన్స్ క్లబ్ ఆఫ్ కడప అన్నమయ్య ప్రధాన కార్యదర్శి కొండూరు జనార్దన్‌రాజు మాట్లాడుతూ తిలక్ సేవలు మరువలేమన్నారు.